క్లుప్తంగా

దోమ కాటు.. ఆరోగ్యానికి చేటు



ఫీవర్, లార్వా సర్వేల కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారిణి

పులివెందుల రూరల్ : దోమ కాటు ఆరోగ్యానికి చేటు అని జిల్లా మలేరియా అధికారిణి మనోరమ తెలిపారు. సోమవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో జరుగుతున్న ఫీవర్ సర్వే, లార్వా సర్వే కార్యక్రమాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. మలేరియా, డెగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో, పరిసరాల్లో శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజా మొహిద్దీన్, మలేరియా యూనిట్ అధికారి సిద్ధయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలోకి పీహెచ్‌సీ వైద్యులు



పీహెచ్‌సీలో వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

చింతకొమ్మదిన్నె : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యులు అందుబాటులో లేకపోవడంతో జూనియర్ వైద్యులు (ట్రైనీ), నర్సులు మిగతా సిబ్బంది వైద్య సేవలు అందించారు. మహిళా వైద్యులు ఒకరు సెలవులో ఉండగా, మరో వైద్యుడు రాఘవేంద్ర ఆసుపత్రిలో లేకపోవడంతో ఫోన్ ద్వారా సమాచారం కోరగా తాను సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగా వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వారం రోజుల్లో పందులను తరలించాలి

ఎర్రగుంట్ల : పురపాలక పరిధిలో ఉన్న పందులను వారం రోజులలో బయటకు తరలించాలని కమిషనర్ శేషఫణి తెలిపారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో ఆయన పట్టణంలోని పందుల యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తరలించలేదంటే మున్సిపల్ సిబ్బందితో తరలిస్తామన్నారు.

సమ్మెకు సిద్ధమైన జేఏసీ



ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావుకు సమ్మె నోటీసు ఇస్తున్న జేఏసీ నాయకులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని జేఏసీ సమ్మెకు సిద్ధమైంది. ఈ మేరకు సమ్మె నోటీసును సోమవారం ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావుకు అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించని పక్షంలో 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మెను చేపడుతామని వారు తెలిపారు. విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు వివిధ రూపాలలో అందోళన చేపట్టిన విషయం తెలిసిందే అన్నారు.

సరిహద్దుల విభజన ముసాయిదా ఆవిష్కరణ



27 వార్డుల విభజన ముసాయిదాను విడుదల చేస్తున్న కమిషనర్ శేషఫణి

ఎర్రగుంట్ల : పురపాలక సంఘం పరిధిలో నూతనంగా ఏర్పడుతున్న 7 వార్డులను కలుపుకుని మొత్తం 27 వార్డులకు సంబంధించి సరిహద్దుల విభజన ముసాయిదాను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది విడుదల చేశారని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు మున్సిపాలిటీలో 1 నుంచి 27 వార్డులకు సంబంధించి సరిహద్దులను గుర్తించామన్నారు. విభజనలో ఏవరికైన అభ్యర్థనలు ఉంటే వారు మున్సిపల్ కార్యాలయానికి అక్టోబరు 6వ తేదీలోగా వచ్చి అభ్యర్థనలు చేయాలన్నారు. 27 వార్డుల విభజనకు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీపీఓ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వీఎన్‌పల్లెకు నరేన్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి మంగళవారం వీరపునాయునిపల్లెకు రానున్నట్లు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. పార్టీ కార్యాలయంలో ఆయన డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ విడుదల చేస్తారన్నారు.

చదువులతల్లి.. సరస్వతీదేవి



పులివెందుల : సరస్వతీదేవి అలంకారంలో వాసవీమాత



వేముల : శ్రీకామాక్షిదేవి అలంకారంలో శ్రీనల్లనమ్మ అమ్మవారు



సింహాద్రిపురం : సరస్వతీదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి అమ్మవారు



పులివెందుల : అమ్మవారి బిందెసేవలో ఆర్యవైశ్యులు, యువకులు



కమలాపురం : బిందెసేవలో పాల్గొన్న ఆర్యవైశ్యులు



శ్రీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో బిందె సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య సభ్యులు



కమలాపురం : వివిధ వేషధారణల సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్న కళాకారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని అమ్మవారి ఆలయాలలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిశాలలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీసరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంకాలమ్మ ఆలయంలో శ్రీసరస్వతిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రీవేంకటరమణుడి ఆలయంలో స్వామివారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఉదయం అమ్మవారి మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారిశాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, శాశ్వత ఉభయదారుల ఆధ్వర్యంలో పగలు బిందె సేవను ఘనంగా నిర్వహించారు. పెళ్లి కాని యువకులు కఠిన ఉపవాసంతో బిందె సేవలో పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలోని పుర వీధుల్లో బిందె సేవ వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య యువకులు కళశం తలపై పెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. ఏలూరుకు చెందిన 35 మంది కళాకారులు వివిధ వేషధారణలతో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 8వ రోజు అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

వేములలో..

వేముల : గొల్లలగూడూరులోని శ్రీనల్లనమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీసరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని శ్రీమత్ కన్యకాపరమేశ్వరిదేవి ఆలంయలో శ్రీ సరస్వతిదేవి అలంకరణలో, శ్రీ ఏరువాక గంగమ్మతల్లి దేవాలయంలో శ్రీ సరస్వతిదేవి అలంకరణలో, నడివూరులో శ్రీ అంకమ్మ తల్లి దేవాలయంలో శ్రీ సరస్వతిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శినమిచ్చారు. పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో బిందె సేవ పూజ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్థానిక గ్రామదేవత పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మవారు సరస్వతిదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం బిందెసేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం యువకులు స్థానిక అమ్మవారిశాల నుంచి పురవీధుల్లో బిందెసేవ కార్యక్రమంలో పాల్గొన్నారు.అంతకుముందు అమ్మవారిశాలలో పూజలు నిర్వహించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : తలపనూరు గంగమ్మ, గడ్డంవారిపల్లె రాజరాజేశ్వరీదేవి, కీర్తిపల్లె నల్లనమ్మ, అనిమెల బోగాదమ్మ, సంగమేశ్వరాయలంలో పార్వతీదేవి, పోచంరెడ్డిపల్లె అంకాలమ్మతల్లి, ఉరుటూరు చౌడమ్మతల్లి సరస్వతిదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మండలంలోని గడ్డంవారిపల్లెలోని రాజ రాజేశ్వరీదేవికి మంగళవారం ఉదయం 10 గంటలకు బోనాల ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : కొత్తపేట గంగమ్మతల్లి సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి సరస్వతిదేవి అలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు హరిహర నాథ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వాసవీ మాతకు బిందెసేవ ఘనంగా నిర్వహించారు. సోమవారం మూలా నక్షత్రం పురస్కరించుకుని వాసవీమాత బిందెసేవ నిర్వహించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీకళ్యాణ మండపం, మహిళా మండలి, అవోపా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : పొలతల క్షేత్రంలో పార్వతిదేవి అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శినమించారు. ఆలయ ఈఓ కృష్ణానాయక్, అర్చకుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

వల్లూరులో..

వల్లూరు : స్థానిక శ్రీవాసవీ ఆర్య వైశ్య కల్యాణ భవనంలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి శ్రీ సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే ఉదయం బిందె సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే దుగ్గాయపల్లెలోని శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.



ఎర్రగుంట్ల : శ్రీ సరస్వతీదేవి అలంకరణలో శ్రీ ఏరువాక గంగమ్మతల్లి అమ్మవారు



ముద్దనూరులో బిందెసేవ కార్యక్రమం



వీరపునాయునిపల్లె : సరస్వతీదేవి అలంకరణలో అనిమెల బోగాదమ్మతల్లి



చింతకొమ్మదిన్నె : సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన గంగమ్మతల్లి



జమ్మలమడుగు : కన్యతీర్థంలో సరస్వతీదేవి అలంకరణలో బాలాత్రిపుర సుందరీదేవి



వేంపల్లె : వాసవీమాత బిందె సేవలో పెళ్లికాని ఆర్యవైశ్య యువకులు



పెండ్లిమర్రి : పొలతలలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



వల్లూరు : బిందె సేవలో పెళ్లికాని ఆర్యవైశ్య యువకులు

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : పట్టణంలోని స్థానిక విజయ్ గార్డెన్ ఫంక్షన్ హాలులో సోమవారం 21వ వార్డు కౌన్సిల్ సోకే వెంకటరమణ (కోడి రమణ) కుమారుడు సోకే వంశీ వివాహం తలుపుల శోభకళతో జరిగింది. ఈ వివాహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, కౌన్సిలర్లు ఖాదర్ బాషా, పురుషోత్తం, రాజశేఖరరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కోళ్ల భాస్కర్, ఫైర్ రామకృష్ణ తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

కమలాపురం : పలు కేసుల్లో జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప బాబాఫక్రుద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన కమలాపురం సబ్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను విజిట్ చేసి రిజిష్టర్లను పరిశీలించారు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఖైదీల ఆరోగ్యం పై సబ్ జైలు సూపరింటెండెంట్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సిబ్బంది, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన కుర్రాళ్లు



సూఫియాన్



లక్ష్మన్న

కమలాపురం : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కమలాపురంకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పట్టణంలోని దర్గా వీధికి చెందిన షేక్ మహ్మద్ సూఫియాన్ గుంటూరులో ఈనెల 27 నుంచి గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ క్రీడా మైదానంలో జరిగిన కిడ్స్ జావెలిన్ త్రో విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కమలాపురంలోని పీవీఎస్‌ఆర్‌ఎం జూనియర్ కళాశాలకు చెందిన సెకండియర్ విద్యార్థి లక్ష్మన్న అండర్-19 అథ్లెటిక్స్ 5కే వాక్ రేస్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

సమస్యలపై స్పందించని ఏపీజెన్‌కో



సమావేశంలో మాట్లాడుతున్న స్ట్రగుల్ కమిటీ నాయకులు

ఎర్రగుంట్ల : విద్యుత్ ఉద్యోగుల కాంట్రాక్ట్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని పలు మార్లు విన్నవించినా ఏపీజెన్‌కో యజమాన్యం స్పందించలేదని విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డి.సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సుబ్బిరెడ్డిలు తెలిపారు. సోమవారం ఆర్టీపీపీలోని యూనియన్ కార్యాలయంలో స్ట్రగుల్ కమిటీ సమావేశం వారు మాట్లాడుతూ ఏపీజెన్‌కోలో కాంట్రాక్ట్ కార్మికులు 20 ఏళ్లుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. వారిలో ఎలాంటి ఎదుగుదల లేదన్నారు. ఇప్పటికైన కార్మికులు సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

వచ్చేది జగనన్న ప్రభుత్వమే..

- భవిష్యత్తు అంతా కార్యకర్తలదే..
- కార్యకర్తల కోసమే డిజిటల్ బుక్ యాప్
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి



డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు విడుదల చేస్తున్న నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని, భవిష్యత్తు అంతా కార్యకర్తలదేనని, కార్యకర్తల సంక్షేమం కోసమే డిజిటల్ బుక్ యాప్‌ను జగనన్న ప్రవేశ పెట్టారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అన్ని మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలతో కలసి డిజిటల్ యాప్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపై ఏమాత్రం శ్రద్ధ చూపలేదని మండి పడ్డారు. ఇచ్చిన హామీల పట్ల శ్రద్ధ లేదు.. సంపద సృష్టిపై శ్రద్ధ అంతకన్నా లేదు.... కేవలం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడం పై మాత్రమే కూటమి నాయకులకు శ్రద్ధ ఉందని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వ హయాంలో అన్యాయానికి గురైన ప్రతి ఒక్కరూ ఈ డిజిటల్ బుక్ యాప్‌ను అప్‌లోడ్ చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. రెడ్ బుక్‌లో లోకేష్ ఏమి రాసుకున్నాడో తెలియదు గాని, డిజిటల్ బుక్ మాత్రం ఓపెన్ ప్లాట్‌ఫాం అని, ఎంత మంది ఉన్నారో ఎవరైనా చూసుకోవచ్చని ఆయన అన్నారు. రెడ్‌బుక్‌కు, డిజిటల్ బుక్‌కు చాలా తేడా ఉందన్నారు. డిజిటల్ బుక్ ఒక్కసారి అమల్లోకి వస్తే దాని పర్యవసానాలు వేరేగా ఉంటాయని, ఆ పర్యవసానాలకు కారణం కూటమి ప్రభుత్వమేనని జగనన్న చెప్పారని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుల్లోనే పాలన సాగిస్తోందన్నారు. జగన్న ప్రభుత్వం మాత్రం కులం, మతం, పార్టీ, ప్రాంతం ఏదీ చూడకుండా అర్హత ఉంటే చాలు అన్ని పథకాలు ఇంటికే వస్తాయని పాలన చేసిన చూపించారన్నారు. ఓట్లు వేసిన వారికే స్పందిస్తానంటూ చంద్రబాబు బహిరంగంగా చెప్పడం దారుణం అన్నారు. నిండు సభలో జగనన్నను బాలకృష్ణ సైకో అని చెప్పడం సరికాదన్నారు. సైకో ఎవరనేది రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. రాష్ట్ర ప్రజలు బాధ పడుతుంటే రాక్షసానందం పొందుతున్న కూటమి ప్రభుత్వ నాయకులు సైకో శాడిస్టులన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు విసిగి వేసారి పోయారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని, భవిష్యత్తు అంతా కార్యకర్తలదేనని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఉత్తమారెడ్డి, జీఎన్ భాస్కర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, వీరారెడ్డి, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మహ్మద్ సాదిక్, కొండారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, చీర్ల సురేష్, గండి భాస్కర్, మోనార్క్, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న సభ్యులు

జమ్మలమడుగు : పట్టణంలోని నాగుల కట్ట వీధిలో నివాసం ఉంటున్న సుబ్బులక్షుమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బంధువులు ఎవ్వరు అంత్యక్రియలు నిర్వహించటానికి ముందుకు రాకపోవడంతో స్థానికులు మేము హెల్ప్‌యూ పట్టణ అధ్యక్షుడు అహమ్మద్ హుస్సేన్‌ను సంప్రదించారు. సోమవారం పెన్నానది సమీపంలో అంత్యక్రియలను నిర్వహించారు.

సున్నపురాళ్లపల్లెలో పర్యటించిన జెడ్పీ సీఈఓ



ప్రజలతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఓబులమ్మ

ఎర్రగుంట్ల : మండలంలోని సున్నపురాళ్లపల్లెలో జెడ్పీ సీఈఓ ఓబులమ్మ సోమవారం పర్యటించారు. తడి, పొడి చెత్త సేకరణ ఏవిధంగా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి తాగునీటి సరఫరా చేసే నీటి ట్యాంకుల వద్ద ఏవిధమైన కంప చెట్లు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఎక్కడ కూడా పైపులైన్ లీకేజిలు లేకుండా మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ రామాంజనేయులు, గ్రామ సర్పంచ్ వరలక్ష్మీ, ఎంపీడీఓ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలోనే పెన్షన్లను పంపిణీ చేస్తాం



కమిషనర్ శేషఫణికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో పింఛన్ ఇంటింటికి పంపిణీ చేయలేమని, సచివాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పంపిణీ చేస్తామని పట్టణ వార్డు సచివాలయాల ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కమిషనర్ శేషఫణికి వారు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి మా సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. అయితే వికలాంగులు, పేషంట్లకు మాత్రం ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేస్తామన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : లబ్ధిదారుల ఇళ్ల వద్దకు కాకుండా సచివాలయంలోనే లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేస్తామని సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం గ్రామ, వార్డు సచివాలయం జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అక్టోబర్ 1వ తేదీన పెన్షన్ ఇళ్ల వద్దకు వెళ్లి ఇచ్చేదిలేదంటూ అధికారులకు తెలియజేశారు. మంచం మీద ఉన్నవారికి, వికలాంగులకు, రోగులకు మాత్రమే ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేస్తామని మిగతా వారికి సచివాలయంలోనే పంపిణీ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ జెఏసీ ఉద్యోగులు పాల్గొన్నారు.